సాక్షి అనకాపల్లి

శుక్రవారం : 27 : జూన్ : 2025



ఘనంగా పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్(విశాఖ) : విశాఖ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి త్రికాల పంచామృతఅభిషేకం ఘనంగా నిర్వహించారు.



పుస్తకావిష్కరణ

సీతంపేట: కె.విశ్వేశ్వరరావు రచించిన 'మనో జలధి' కవితా సంపుటిని గురువారం పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు.



భూములు ఇచ్చేది లేదు

ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇచ్చేది లేదని పలువురు రైతులు వేంపాడులో నిరసన తెలిపారు. 8లో

చదువు కోసం..

చిన్నారుల నడకయాతన



పుస్తకాల సంచులు మోసుకుంటూ కాలినడకన పాఠశాలకు వెళుతున్న గిరిజన బాలలు

అమృత్ మహోత్సవాలు జరుపుకొన్న **స్వతంత్ర** భారతం.. నూరేళ్ల సంబరాలకు **ఇప్పటి** నుంచే ప్రణాళికలు రచించే నాయకులున్న **దేశం.. చిరు** పాదాలు కందిపోతున్నా కానరాని **దైన్యం.. గిరిజన** ప్రాంతంలో పుట్టడమేనా వారు చేసిన పాపం.. రోలుగుంట మండలంలో అర్ల పంచాయతీ శివారు పెదగరువు, కొత్తలోసింగి, పాత లోసింగి గిరిజన గ్రామాల్లోని బాలలు చదువు కోసం పడుతున్న పాట్లను ప్రతిఫలిస్తోంది ఈ చిత్రం. ఈ గ్రామాలకు రోడ్డు లేదు. బస్సు రాదు. పాఠశాల అసలే లేదు. ఆరు కిలోమీటర్ల దూరంలోని వైబీ పట్నంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల, పది కిలోమీటర్ల దూరంలోని బీబీ పట్నంలో ఉన్నత పాఠశాలలే వారికి దిక్కు. గతంలో పెదగరువులో విద్యా వలంటీర్‌తో తాత్కాలిక పాఠశాల నడిపారు. ఇప్పుడు అది కూడా లేకపోవడంతో అక్షరాలు దిద్దించేవారు సైతం కరువయ్యారు. కొండ శిఖరాగ్రాన ఉండే ఈ గ్రామాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో మట్టితో కాలిబాటలు వేశారు. అవి వేశాక కనీసం నడిచేందుకు కాస్త వీలుగా ఉన్న పరిస్థితి. ఆరు కిలోమీటర్లు నడిస్తే గానీ వైబీ పట్నం అప్పర్ ప్రైమరీ స్కూలు రాదు. అక్కడి నుంచి బీబీ పట్నానికి ఆటోలు తిరుగుతాయి. పెదగరువు గ్రామంలో ఏడుగురు, కొత్తలోసింగి, పాతలోసింగి గ్రామాల్లో 13 మంది మొత్తం 20 మంది బడి ఈడు పిల్లలున్నారు. వేసవి సెలవులనంతరం వారు పాఠశాలలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. చదువుకోవాలంటే ఇటు ఆరు కిలోమీటర్లు.. అటు ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే. దీనిపై గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు, సంఘ నాయకులు కిల్లో నరసయ్య మాట్లాడుతూ పెదగరువులో గానీ, కొత్తలోసింగి, పాత లోసింగి గ్రామాల్లో కానీ ఒక పాఠశాల ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థుల కష్టాలు తీర్చాలని అధికారులను కోరారు.

– రోలుగుంట

న్యూస్‌రీల్

మృత్యువుతో పోరాడి ఓడారు

- లంకెలపాలెం లారీ బీభత్సం
- ఐదుకు చేరిన మృతుల సంఖ్య



వాహనచోదకుడు రాంకుమార్(ఫైల్)



కంటైనర్ డ్రైవర్ అప్పలరాజు(ఫైల్)

పరవాడ/రావికమతం: లంకెలపాలెం కూడలిలో మార్కెట్ లారీ సృష్టించిన బీభత్సంలో విషాదం కొనసాగుతోంది. ఈ నెల 23న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. వేర్వేరు ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్న మరో ఇద్దరు గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దీంతో ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య ఐదుకు చేరినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. మృతులను కంటైనర్ డ్రైవర్ రేఖ అప్పలరాజు(విజయరాంపుర అగ్రహారం, రాంబిల్లి మండలం), వాహనచోదకుడు సాలాపు రాంకుమార్ (కొత్తకోట, రావికమతం మండలం)గా గుర్తించారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి అప్పలరాజు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో, రాంకుమార్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. కాగా, ప్రమాదం జరిగిన రోజే అనకాపల్లికి చెందిన కొణతాల అచ్చెంనాయుడు, రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ, అగనంపూడి వాసి ఎర్రప్పడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరో ఇద్దరు మరణించడంతో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరికొంత మంది ఇంకా వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

పూరీ రథయాత్ర కోసం మరో స్పెషల్

తాటిచెట్లపాలెం (విశాఖ): త్వరలో పూరీలో జరగనున్న రథయాత్ర కోసం విశాఖపట్నం నుంచి స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం –పూరీ (08313)రథయాత్ర స్పెషల్ జూలై 5వ తేదీ మధ్యరాత్రి 12.45 గంటలకు బయల్దేరి.. 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో పూరీ–విశాఖపట్నం(08314) స్పెషల్ జూలై 7వ తేదీ తెల్లవారు 2.15 గంటలకు పూరీలో బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 4–స్లీపర్ క్లాస్, 6–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్/ దివ్యాంగ కమ్ లగేజి కోచ్‌లతో నడుస్తుంది.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం జరగనుంది. ఈ సమావేశంలో మొత్తం 286 అంశాలు చర్చకు రానున్నాయి. వీటిలో మినిస్టీరియల్ సిబ్బంది సర్వీసు అంశాలతో పాటు పలు రెవెన్యూ, అభివృద్ధి సంబంధిత అంశాలు సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నారు. సమిష్టి స్వచ్ఛంద సేవా సొసైటీ నిర్వహిస్తున్న భూపేష్‌నగర్ నైట్ షెల్టర్ కాలపరిమితిని రెండేళ్లకు పునరుద్ధరించడం, జోన్–1లోని తగరపువలస, చిట్టివలస రోడ్డు మార్జిన్ మార్కెట్ ఆశీలు వసూలు లీజుకు ఇవ్వడం, 2025–26 సంవత్సరానికి ముడసర్లోవ పార్క్ క్యాంటీన్ నిర్వహణ కాంట్రాక్ట్, అన్ని జోనల్ కార్యాలయాల పరిధిలోని వాణిజ్య సముదాయాల కాంట్రాక్ట్ పొడిగింపు వంటి అంశాలపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించి ఆమోదం తెలపనున్నారు.

కూటమి నేతల డిష్యుం.. డిష్యుం..



ఎస్.రాయవరం మండలంలో టీడీపీ సూపర్ సర్పంచ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన పార్టీ నాయకుడు సతీష్

ఒక ఒరలో రెండు కత్తులే ఇమడవు. మరి మూడు కత్తులు ఇముడుతాయా? అందుకే ప్రతి రోజూ ఏదో ఒక వివాదం వెలుగు చూస్తోంది. ఎస్.రాయవరం మండలం జేవీ పాలెంలో జనసేన గ్రామాధ్యక్షుడిపై టీడీపీ సూపర్ సర్పంచ్ దాడి చేశారు. ఇంటింటి కుళాయి పనుల వద్ద వివాదం చెలరేగి జనసేన నాయకుడిపైనే కాక అతని తల్లిపై కూడా దౌర్జన్యానికి దిగారు. ఇక మునగపాక మండలం గణపర్తి పాల సంఘ అధ్యక్ష ఎన్నికలో టీడీపీ, బీజేపీ నేతల మధ్య వైరం తారస్థాయికి చేరింది. పరస్పరం కొట్లాటకు దిగారు.. 8లో

సచివాలయ ఉద్యోగుల మెడపై బదిలీ కత్తి

- ఐదేళ్లు పూర్తయిన సచివాలయ ఉద్యోగుల సంఖ్య 3,464
- బదిలీ షెడ్యూల్.. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు

- ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఉంటేనే అనుకూల పోస్టింగ్
- స్థానిక నేతలకు అంగీకారమైతేనే అక్కడ నియామకం
- సచివాలయాల్లో ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ



సాక్షి, అనకాపల్లి: సచివాలయాల్లో ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన వారిని బదిలీ చేయాలన్న నిబంధనను కూటమి నేతలు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఉద్యోగుల మెడపై బదిలీ కత్తి వేలాడదీసి వారిని లొంగదీసుకునేందుకు ఆయుధంగా వాడుకుంటున్నారు. ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని ఇప్పటికే పైనుంచి అనధికార ఉత్తర్వులు అందినట్టు తెలుస్తోంది. స్థానిక కూటమి నేతలు ఔనన్న వారిని, ఎమ్మెల్యే రికమండేషన్ ఉన్న వారిని కోరిన చోట నియమించాలని చెప్పడంతో పలువురు సచివాలయ ఉద్యోగులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు మొదలుపెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన సచివాలయ ఉద్యోగులంటే గుర్రుమీదున్న కూటమి నేతలు బదిలీ అవకాశాన్ని కక్ష తీర్చుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. సొంత మండలాల్లో పనిచేయకూడదన్న నిబంధన అందులో భాగమేనంటున్నారు. బదిలీల ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ఆఫ్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఐదేళ్లు పూర్తయితే బదిలీ..

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఐదేళ్లపాటు పనిచేసిన ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు 2020 అక్టోబరులో కొందరు, నవంబరులో మరికొందరు విధుల్లో చేరారు. నిబంధనల ప్రకారం ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తి చేస్తేనే తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. రెండో విడతలో చేరిన ఉద్యోగులకు మూడేళ్లు మాత్రమే పూర్తి కావడంతో వారి బదిలీకి అవకాశం లేదు. మ్యూచువల్, రిక్వెస్ట్, స్పౌజ్, అనారోగ్య సమస్యలు ఉన్న వారు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు గ్రేడ్‌లుగా విభజన..

సచివాలయాలను మూడు గ్రేడ్‌లుగా విభజించారు. 2,500 లోపు జనాభా ఉంటే 'ఏ' గ్రేడ్‌గా పరిగణిస్తారు. ఆ సచివాలయంలో ఆరుగురు ఉద్యోగులే ఉండాలి. జనాభా 2,500–3,500 మధ్య ఉంటే 'బి' గ్రేడ్‌గా గుర్తిస్తారు, 7 లేదా 8 మంది ఉద్యోగులు ఉండాలి. ఇక 3,500కు పైగా జనాభా ఉన్న సచివాలయాలను సీ–గ్రేడ్‌గా పరిగణిస్తారు. ఈ సచివాలయంలో 8 మంది ఉద్యోగులు ఉండాలని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా.. వివిధ విభాగాల్లో 3,824 మంది విధులు నిర్వహిస్తున్నారు. 465 సచివాలయాల్లో పనిచేస్తున్న ఐదేళ్లు దాటిన వారిని ప్రస్తుతం బదిలీ చేస్తున్నారు. వీటిలో ఏ గ్రేడ్ సచివాలయాలు 119, బీ–గ్రేడ్–165, సీ–గ్రేడ్– 181 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పనిచేసే 3464 మంది ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్ జరగనుంది.

మత్తు వదలి.. ముందుకు కదిలి..

డ్రగ్స్ రహిత సమాజం కోసం అనకాపల్లిలో వాకథాన్



ఎన్టీఆర్ క్రీడామైదానంలో విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు, పోలీసులు

అనకాపల్లి:

మాదక ద్రవ్యాలను అరికట్టాలని, ప్రజల్లో చైతన్యం తేవాలని అనకాపల్లిలో గురువారం భారీ స్థాయిలో వాకథాన్ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీని కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా ఎక్సైజ్ సహాయ కమిషనర్ సూర్జిత్ సింగ్ ప్రారంభించారు. విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ క్రీడామైదానానికి చేరుకొని ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారిని మొక్కగా ఉన్నప్పుడే తుంచేసే ఉద్దేశంతో విద్యార్థులకు యువకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డ్రగ్స్ బారిన పడి చాలా కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని, వేల మంది జీవితాలు నాశనం అవుతున్నాయని, ఆర్థికంగా చితికిపోతున్నారని చెప్పారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం అరికట్టేందుకు 5 స్టాటిక్ చెక్ పోస్టులు, 38 డైనమిక్ చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసి, ప్రత్యేక బృందాలతో నిఘా ముమ్మరం చేశామన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, వివిధ వర్గాల ప్రజలు

జిల్లా ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలాజీ, ఆర్డీవో షేక్ ఆయిషా, డీఎస్పీ శ్రావణి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి సుజాత, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణ, గఫూర్, చంద్రశేఖర్, బాల సూర్యారావు, లక్ష్మి, అశోక్ కుమార్, అల్లు స్వామినాయుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, కాలేజీ, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని భూమికి దిక్కెవరు?

- సైతారుపేటలో ఆలయ భూమిలో రహదారి నిర్మాణం
- రెవెన్యూ, పోలీసులకు దేవదాయ శాఖ అధికారుల ఫిర్యాదు
- అధికార పార్టీ నేత ఒత్తిడితో ఆక్రమణకు ప్రోత్సాహం

ఆలయాలకు భూములు, ఆస్తులు దానమివ్వడం పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం. ఇప్పటికీ కొందరు దానమిస్తుండడం చూస్తుంటాం. అయితే ఆలయ భూముల ఆక్రమణల ఘటనలు చాలా అరుదుగా వింటుంటాం. తాజాగా ఎస్.రాయవరం మండలం సైతారుపేటలో శ్రీరామాలయం భూమిని ఆక్రమించి దర్జాగా రహదారి నిర్మాణం చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ దురాక్రమణకు స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో దేవదాయ శాఖ అధికారులు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఎస్.రాయవరం: యలమంచిలి దేవదాయ డివిజన్ కార్యనిర్వహణాధికారి పరిధిలో ఎస్.రాయవరం మండలం సైతారుపేట గ్రామంలోని శ్రీరామాలయానికి సర్వే నంబరు 141లో 1.04 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి చెందిన వీసం సన్యాసినాయుడు కుటుంబం ఈ భూమిని ఆలయానికి రాసిచ్చింది. ఈ భూమికి ఆనుకుని ఓ అధికార పార్టీ నాయకుడి ఇల్లు ఉంది. ఆ నాయకుడి ఇంటికి వాహనాలు వెళ్లేందుకు వీలుగా రహదారి నిర్మించడం కోసం ఆలయ భూమి ఆక్రమణకు తెగబడ్డారు. అంతటితో ఆగకుండా దేవదాయ జిల్లా అధికారిణికి స్థానిక టీడీపీ నేత ఈ రహదారి నిర్మాణాన్ని ఎలా అడ్డుకుంటారో చూస్తాను అంటూ చెప్పి మరీ సవాల్ విసరడం చర్చనీయాంశమైంది. దీన్ని సీరియస్‌గా పరిగణించిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు భవిష్యత్తులో ఈ ఆలయ భూమిలో క్రమంగా మరిన్ని ఆక్రమణలు చోటుచేసుకునే అవకాశం ఉందని భావించి చర్యలకు ఉపక్రమించారు.

పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

సైతారుపేట శ్రీరామాలయం భూమిలో గ్రామానికి చెందిన టీడీపీ నేత దౌర్జన్యంగా రహదారి నిర్మాణం చేస్తున్నారంటూ యలమంచిలి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాదేవి ఈ నెల 11న రాత పూర్వకంగా ఎస్.రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణ నిలుపుదల చేయాలని, దీనికి బాధ్యులెవరనేది ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినా పోలీసులు స్పందించలేదు. సైతారుపేట రామాలయానికి ఉన్న 1.04 ఎకరాలకు సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని కోరుతూ యలమంచిలి దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి కె.సాయివెంకట తేజ.. ఎస్.రాయవరం తహసీల్దార్‌కు ఈ నెల 20న మీసేవ ద్వారా దరఖాస్తు చేయడంతో పాటు అధికారికంగా లేఖ ద్వారా కోరారు. రెవెన్యూ అధికారులు కూడా స్పందించకపోవడంతో ఆక్రమణదారులు ఇప్పటికే ఆలయ భూమిలోంచి పంచాయతీ చెత్తతో రహదారి నిర్మాణం కోసం పూనుకున్నారు.



సచివాలయ సర్వేయర్‌ను నిలదీస్తున్న ఆలయ ధర్మకర్త వీసం వెంకట లలిత



సైతారుపేట శ్రీరామాలయం భూమిని ఆక్రమించుకుని వేస్తున్న రహదారి

విస్తుపోయిన దేవదాయ శాఖ అధికారులు

ఆలయ భూమికి గురువారం సర్వే చేస్తామని సచివాలయ సర్వేయర్ దేవదాయ శాఖ అధికారులకు నోటీసు ఇచ్చారు. ఈ మేరకు దేవదాయ అధికారులు, శ్రీరామాలయం ట్రస్టీ గురువారం ఉదయం భూమి వద్దకు చేరుకున్నారు. అయితే సర్వేయర్ మాత్రం భూమికి సర్వే చేయడానికి వీలుపడదని, సర్వే చేయాల్సిన భూమి హద్దుల్లో ఉన్న యజమానులకు నోటీసులు ఇవ్వలేదని చెప్పడంతో దేవదాయ శాఖ అధికారులు కంగుతిన్నారు. సర్వే ప్రొసీజర్ ప్రకారం హద్దుల్లో ఉన్న వారికి కూడా నోటీసులు ఇవ్వాల్సి ఉండగా సచివాలయ సర్వేయర్ ఉద్దేశ పూర్వకంగా కాలయాపన చేసి ఆక్రమణకు సహకరించడానికే చూస్తున్నారని శ్రీరామాయలం ట్రస్టీ వీసం వెంకట లలిత ఆరోపించారు. రెవెన్యూ అధికారుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి అందరికీ నోటీసులు ఇచ్చి భూమికి సర్వే చేసి, హద్దులు నిర్ణయిస్తామని సర్వేయర్ చెప్పారు.

దీంతో దేవదాయ శాఖ అధికారులు చేసేదేమీలేక అక్కడ్నుంచి వెనుదిరిగాల్సి వచ్చింది. ఆలయ భూమి ఆక్రమణను అడ్డుకోవడానికి యత్నిస్తున్న దేవదాయశాఖ అధికారులకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సహాయ నిరాకరణ చేయడం, అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దేవుని భూమిని కాపాడాలి



మా తాత వీసం సన్యాసినాయుడు శ్రీరామునిపై భక్తితో ఇక్కడ భూమిని రాసిచ్చారు. సదుద్దేశంతో ఇచ్చిన భూమిని ఇక్కడ కొందరు ఆక్రమించుకోవడానికి చూస్తున్నారు. పంచాయతీ పాలకుల సపోర్టుతోనే ఇదంతా జరుగుతోంది. దేవుని భూమిలో రహదారి నిర్మాణానికి పంచాయతీ పాలకులు ఎలా ఆమోదం చెబుతారు. కళ్లముందే మా కుటుంబం ఆలయ నిర్వహణ కోసం ఇచ్చిన భూమిని ఆక్రమించుకుంటున్నారు. గతంలోనే దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశాను. ఆలయ భూమిని ఆక్రమించుకోవడం దురదృష్టకరం. అధికారులు ఆక్రమణను ఆపాలి.

– వీసం వెంకట లలిత, ఆలయ ట్రస్టీ

- జేవీపాలెంలో జనసేన గ్రామాధ్యక్షుడిపై టీడీపీ సూపర్ సర్పంచ్ దాడి
- ఇంటింటి కుళాయి పనుల వద్ద వివాదం
- మహిళలపై దౌర్జన్యానికి దిగిన టీడీపీ నేత
- గణపర్తి పాల సంఘ అధ్యక్ష ఎన్నికలో టీడీపీ-బీజేపీ వైరం


జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు సతీష్ కుటుంబీకులపై దాడికి పాల్పడుతున్న సూపర్ సర్పంచ్ శంకర్రావు


సతీష్ తల్లి రత్తమ్మపై దౌర్జన్యం చేస్తున్న శంకర్రావు

కూటమి నేతల డిష్యుం..డిష్యుం..

ఏడాది పాలనలోనే కూటమి నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పై స్థాయిలో కూటమి పెద్దలంతా ఒక్కటేనని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. కింద స్థాయిలో మాత్రం వివాదాలు రాజుకుంటున్నాయి. పరస్పర దాడులకు సైతం దిగేందుకు వెనుకాడటం లేదు. తాజాగా ఎస్.రాయవరం మండలం జేవీపాలెంలో ఇంటింటి కుళాయి విషయమై జనసేన గ్రామాధ్యక్షుడిపైనా మహిళలపైనా టీడీపీ సూపర్ సర్పంచ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. మునగపాక మండలం గణపర్తి పాల సంఘం అధ్యక్ష ఎన్నికలో బీజేపీ, టీడీపీ నేతల మధ్య వైరం తారస్థాయికి చేరి కొట్లాటకు దిగారు.

నక్కపల్లి/ఎస్.రాయవరం: ఇంటింటి కుళాయిల ఏర్పాటు విషయమై టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో హోం మంత్రి అనిత అనుచరుడు, టీడీపీ సీనియర్ నేత, సర్పంచ్ భర్త శంకర్రావు జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు కుటుంబంపై దౌర్జన్యానికి దిగడమే కాకుండా మహిళలపై దాడికి పాల్పడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్.రాయవరం మండలం జేవీ పాలెంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె సతీష్‌కు, టీడీపీకి చెందిన సూపర్ సర్పంచ్ వజ్రపు శంకర్రావు (ప్రస్తుత సర్పంచ్ భర్త)కు మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ కారణంగా సతీష్ ఇంటికి కుళాయి వేసే పనులను నిలుపుదల చేశాడు. దీంతో సతీష్ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లాడు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి దృష్టికి తీసుకొచ్చాడు. జనసేన నాయకులు ఎంపీడీవోతోపాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నెల 24న సిబ్బంది అతడి ఇంటికి కుళాయి వేసే పనులు ప్రారంభించారు. ఈ పనులు తుది దశకు చేరుకున్న విషయం తెలుసుకున్న శంకర్రావు తన అనుచరులతో గురువారం ఆ ప్రాంతానికి వచ్చాడు. అక్కడ పంచాయతీ సిబ్బంది సాయంతో పైపులు తొలగించేందుకు సిద్ధపడ్డాడు. ఈ ప్రయత్నాన్ని సతీష్‌తోపాటు అతని తల్లి రత్తమ్మ, ఇతర కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో శంకర్రావు తన వర్గీయులతో కలిసి వారిపై దౌర్జన్యానికి దిగాడు. మహిళలని చూడకుండా తమ కుటుంబ సభ్యులపైన దాడికి పాల్పడ్డారంటూ బాధితుడు సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శంకర్రావు తనని చంపుతానని బెదిరిస్తున్నాడని, అతని వల్ల తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరాడు.

గణపర్తిలో టీడీపీ-బీజేపీ మధ్య తారస్థాయిలో విభేదాలు

మునగపాక: కూటమి కూర్పు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతుంది. పై స్థాయిలో కూటమి పెద్దలంతా ఒక్కటిగా కలిసి ఉన్నామంటూ చెప్పుకుంటున్నా కింద స్థాయిలో మాత్రం మూడు పార్టీల మధ్య రోజురోజుకు అగాధం పెరుగుతూనే వస్తోంది. తాజాగా మండలంలోని గణపర్తి పాల సంఘం అధ్యక్ష ఎన్నికకు ఏకాభిప్రాయం కుదరకపోవడంతో బుధవారం రాత్రి టీడీపీ-బీజేపీ శ్రేణులు డిష్యూం, డిష్యూంకు దిగాయి. దీనిలో భాగంగా పాల సంఘం అధ్యక్షునిగా టీడీపీ నుంచి మాజీ సర్పంచ్ రామ నాగేశ్వరరావు, బీజేపీ నుంచి ప్రస్తుత అధ్యక్షుడు త్రినాథ్ నిలబడేందుకు ముందుకొచ్చారు. పది సంవత్సరాలుగా అధ్యక్షునిగా త్రినాథ్ కొనసాగడంతో ఈసారి అతను తప్పుకోవాలంటూ టీడీపీ నేత రామనాగేశ్వరరావు వర్గీయులు కోరారు. ఇందుకు త్రినాథ్ వర్గీయులు తమకు విశాఖ డెయిరీ పెద్దల సహకారం ఉందని, ఈ విషయమై ససేమిరా అనడంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఒక వర్గంపై మరో వర్గం దాడి చేసుకునే స్థాయికి వివాదం చోటు చేసుకుంది. అర్ధరాత్రి ఒంటి గంట వరకు చర్చలు జరిగినా ఫలితం లేకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. ఈ వివాదానికి సంబంధించి ఒక వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసుకునే స్థాయికి వెళ్లడంతో కూటమిలో కుమ్ములాట చిలికి చిలికి గాలివానగా మారే అవకాశం లేకపోలేదు. మొత్తం మీద కూటమిలో కుంపటి రాజేసుకుందనడంలో సందేహం లేదు.

పీజీ సెట్‌లో ర్యాంకుల పంట


కామరాజు, హిస్టరీ (24)


జె.వరలక్ష్మి కామర్స్ (101)


కె.చాందిని, బోటనీ (127)

నర్సీపట్నం: పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ పోటీ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో మంచి ర్యాంకులు సాధించారు. ఎం.కామరాజు హిస్టరీలో 24వ ర్యాంకు, జె.వరలక్ష్మి కామర్స్‌లో 101వ ర్యాంకు, కె.చాందిని బోటనీలో 127, ఎల్.అశ్విని బోటనీలో 214, సిహెచ్.మౌనిక పొలిటికల్ సైన్స్‌లో 256, కె.నందిని బోటనీ 307, సిహెచ్.దుర్గాప్రసాద్ కామర్స్ 347, కె.సంజన బోటనీ 379, ఎన్.రోహిణి బోటనీ 587, జి.రమ్య రాజేశ్వరి దేవి కెమికల్ సైన్స్‌లో 610 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజు, అధ్యాపకులు అభినందించారు. డాక్టర్ ఎన్టీఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారు. గణితంలో ఎన్.వినయ్ కుమార్ 18వ ర్యాంకు, వృక్షశాస్త్రంలో ఎ.లక్ష్మీశ్రావణి 97, గాయత్రి 127, వి.శ్యామల 184 ర్యాంకులు సాధించారు. రసాయన శాస్త్రంలో కె.మధు కిరణ్ 144వ ర్యాంకు సాధించారు.


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎన్టీఆర్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం

పీజీ సెట్‌లో జ్యోత్స్నకు 4వ ర్యాంకు



యలమంచిలి రూరల్: ఏపీ పీజీ సెట్‌లో యలమంచిలికి చెందిన రావాడ జ్యోత్స్న సత్తా చాటింది. ఆమె కెమికల్ సైన్సెస్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. స్థానిక గీతాంజలి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన జ్యోత్స్న ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది. తమ కుమార్తెకు ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు నాగేశ్వరరావు, కరుణకుమారి ఆనందం వ్యక్తం చేశారు. పీజీ పూర్తి చేసి మంచి ఉన్నత ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యమని జ్యోత్స్న సాక్షికి తెలిపింది.

లంకెలపాలెం జంక్షన్‌లో ప్రమాదాలు నివారించండి

- ఎస్పీ తుహిన్ సిన్హాకు ఐక్య వేదిక సభ్యుల వినతి

అనకాపల్లి టౌన్: లంకెలపాలెం జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజా రాజకీయ ఐక్యవేదిక సభ్యులు కోరారు. స్థానిక జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హాను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాక నుంచి అనకాపల్లి వచ్చేటప్పుడు ఇక్కడ జంక్షన్‌లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అటువైపుగా వచ్చే వాహనాలకు వేగ నియంత్రణ లేదని, అక్కడ సిగ్నల్స్ దూరం నుంచి సరిగా కనిపించడం లేదని వివరించారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఐక్య వేదిక సభ్యులు కనిశెట్టి సురేష్ బాబు, గాడి బాలు, సూది కొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.


ఎస్పీ తుహిన్ సిన్హాకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా రాజకీయ ఐక్య వేదిక సభ్యులు

జగన్నాథ రథయాత్రకు గట్టి బందోబస్తు

- డీఎస్పీ శ్రావణి
- గవరపాలెంలోని ఆలయం వద్ద ఏర్పాట్ల పరిశీలన

అనకాపల్లి : ప్రశాంతమైన వాతావరణంలో జగన్నాథస్వామి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ శ్రావణి అన్నారు. స్థానిక గవరపాలెం అగ్రిమత్రిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి దేవస్థానంలో తొలి రథయాత్ర ఏర్పాట్లను గురువారం ఆమె పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ పరిశీలించి, కమిటీ సభ్యులతో మాట్లాడారు.

శుక్రవారం ఉదయం జగన్నాథస్వామి రథోత్సవం గవరపాలెం నుంచి రైల్వే స్టేషన్‌గూడ్స్ రోడ్డు ఇంద్రద్యుమ్నహాలు వరకూ జరుగుతుందని, స్వామివారు అక్కడ నవరాత్రులు భక్తులకు వివిధ రూపాల్లో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని డీఎస్పీ చెప్పారు. రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వహణ అధికారి బి మురళీ, కమిటీ సభ్యులు బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వి.వి. సుబ్రహ్మణ్యం, బొడ్డేడ వెంకట చలపతిరావు పాల్గొన్నారు.


జగన్నాథస్వామి రథయాత్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

వెదురు పెంపకంతో అధిక లాభాలు

- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ

రావికమతం : డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు గురువారం రావికమతం వెలుగు కార్యాలయంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ,జీవనోపాదుల విభాగం మరియు ఇండస్ట్రీయల్ ఆఫ్ బాంబుస్ ఆఫ్ బెంగళూరు వారు సంయుక్తంగా మండలంలో వెదురు పంటపై అవగాహన కల్పించారు.మండలంలో వెదురు పెంపకానికి 200 మంది రైతులను గుర్తించాలని బెంగళూరుకు చెందిన ఇండస్ట్రియల్ ఆఫ్ బ్యాంబుస్ సంస్థ ప్రతినిధి కుసుమ కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్)తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు త్రిపుర రకానికి చెందిన వెదురు మొక్కలను ఉచితంగా రైతులకు అందజేస్తామన్నారు. ఈ మొక్కలు నాటడానికి ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

ఒక రైతు వెదురును పెంచేందుకు కనీసం 37 సెంట్లు భూమి ఉండాలన్నారు. నాటిన నాలుగు ఏళ్ల తరువాత ఎదిగిన వెదురును తమ సంస్థ కొనిగోలు చేస్తుందని వివరించారు.

ఒక్కసారి నాటితే 100 సంవత్సరాలు వరకు వెదురును అమ్ముకోవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ , ఏపీఎం ఈశ్వరరావు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ

చీటీల పేరుతో మోసం

- కె.కోటపాడు పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- చౌడువాడలో ఘటన

కె.కోటపాడు : చీటీల పేరుతో సుమారు రూ.4 కోట్ల మేర మోసం చేసిన ఘటన మండలంలోని చౌడువాడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి పెదిరెడ్డి పద్మజతో పాటు మరో ఇద్దరు వ్యక్తుల వద్ద తాము మోసపోయామంటూ బాధితులు గురువారం కె.కోటపాడు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ధనుంజయ్‌తో బాధితుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చౌడువాడ గ్రామానికి చెందిన పెదిరెడ్ల పద్మజ 2016 నుంచి చీటీలు నిర్వహిస్తోంది.

ఆమె వద్ద చౌడువాడతో పాటు గరుగుబిల్లికి చెందిన సుమారు 200 మంది లక్షల్లో చీటీలు కట్టారు. చీటీలు పాడుకున్న వారిలో కొంత మందికి చెల్లింపులు జరపగా, మరికొందరు వడ్డీ డబ్బులకు ఆశపడి ఆమె వద్దనే చీటీ డబ్బులు ఉంచేవారు. ఈ క్రమంలో ఈ నెల 19 నుంచి పద్మజతో పాటు ఆమెకు సహకరించిన మరో ఇద్దరు కనిపించడం లేదు. దీంతో చీటీలు కట్టిన 200 మంది మోసపోయామంటూ కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.


కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా స్వామి



నర్సీపట్నం: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కార్యదర్శిగా నర్సీపట్నానికి చెందిన సిహెచ్.బి.ఎల్.స్వామి ఎన్నికయ్యారు. గురువారం ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహా సభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టు స్వామి 30 సంవత్సరాల నుంచి పాత్రికేయ రంగంలో ఉన్నారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో పనిచేసిన స్వామి జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శిగా పలుసార్లు సేవలందించారు. జర్నలిస్టుల సమస్యలపై ఉద్యమాలు చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర యూనియన్ కార్యదర్శి పదవికి ఈ ప్రాంతం నుంచి మొదటిసారిగా ఎన్నికైన స్వామికి ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు


నిందితులతో ఎస్ఐ రామారావు, సిబ్బంది

గొలుగొండ: ఏజెన్సీ నుంచి స్కూటీపై రెండు కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితలపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. ఏజెన్సీలో చిట్టింపాడు నుంచి చింతపల్లి మండలానికి చెందిన తాంబేలు లక్ష్మి, కట్టు బంద స్కూటీపై వస్తుండగా, జోగుంపేట రోడ్డులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా, వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. స్కూటీ డిక్కీలో రెండు కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

యలమంచిలి రూరల్: మండలంలో కొక్కిరాపల్లి హైవే కూడలికి సమీపంలో బజాజ్ షోరూం వెనుక వైపు రైల్వే ట్రాక్ పక్కన పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఇక్కడ గడ్డిలో మృతదేహం పక్కన కుళ్లిన స్థితిలో ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి వెళ్లిన వారు పురుగుమందు డబ్బా, తొమ్మిది సైజు ఉన్న చెప్పులు, కళ్లద్దాలు లభించాయి. మృతుడి పూర్తి వివరాలు లభించలేదు. మృతదేహం బాగా కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో పది రోజుల క్రితమే మృతి చెంది ఉండొచ్చని, అక్కడ పురుగు మందు డబ్బా దొరకడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టుగా భావిస్తున్నారు. దీనిపై కొక్కిరాపల్లి వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు.

నకిలీ కొండ దొర సర్టిఫికెట్‌తో ఉద్యోగం

కస్టమ్స్ సూపరింటెండెంట్‌పై చర్యలకు ఆదేశం

అల్లిపురం: నకిలీ ఎస్టీ (కొండ దొర) కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఎల్‌డీసీ ఉద్యోగం పొందిన జ్ఞానాపురానికి చెందిన నమర్ల సత్యనారాయణ చేసుకున్న అప్పీలును కొట్టివేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నమర్ల సత్యనారాయణ 1980లో చింతపల్లి ఎమ్మార్వో కార్యాలయం ద్వారా కొండ దొర (ఎస్టీ) సర్టిఫికెట్ పొందారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ఎస్టీ కేటగిరీలో ఎల్‌డీసీ పోస్టును సంపాదించారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం జిల్లా ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కార్యాలయంలో కస్టమ్స్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సత్యనారాయణ పొందిన ఎస్టీ సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ అతని సోదరుడు కోటేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఎస్టీ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వసతి గృహ విద్యార్థినులపై కుక్క దాడి

- ఏడుగురికి గాయాలు


నాతవరం ఆస్పత్రిలో బాధిత విద్యార్థినులు

నాతవరం: మండలంలోని తాండవ గిరిజన బాలికల వసతి గృహంలో గురువారం విద్యార్థినులపై కుక్క దాడి చేసింది. ఈ దాడిలో ఏడుగురు విద్యార్థినులు గాయపడ్డారు. ఇక్కడ వసతి గృహం వద్ద అదనపు భవనం నిర్మాణం కోసం కొంతమేర ప్రహరీ తొలగించారు. దాంతో కుక్క లోపలకు చొరబడి ఒక్కసారిగా విద్యార్థినులపై దాడికి పాల్పడింది. కె.బాబి, కె.రమ్య, జంప దుర్గ, జంప వశిష్ఠ, కె.మీనాక్షి, కె.నారిముని, టి.భానుమతి గాయపడ్డారు. వీరిని వసతి గృహ సిబ్బంది నాతవరం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్సనందించి అనంతరం నర్సీపట్నం సీహెచ్‌సీకి తీసుకెళ్లి మరో వ్యాక్సిన్ వేయించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్పీ, అధికారులు, నాయకులు

- వాకథాన్‌లో ఏఎస్పీ మోహన్‌రావు

పాయకరావుపేట: యువకులు, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిని అలవాటు చేసుకుంటే బానిసై భవిష్యత్ నాశనమవుతుందని జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్ (మాదక ద్రవ్యాలు రహిత భారతం)లో భాగంగా పట్టణంలో వాక్‌థాన్ నిర్వహించారు. స్థానిక కల్యాణ మండపం నుంచి గౌతమ్ థియేటర్ వరకు విద్యార్థులు, అధికారులు, నాయకులు ర్యాలీగా వెళ్లారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. తొలుత కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఏఎస్పీ మాట్లాడారు. గంజాయి, హెరాయిన్, వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీవిద్య, పాయకరావుపేట సీఐ జి.అప్పన్న, కూటమి నాయకులు తోట నగేష్, గెద్దం బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు, యాళ్ల వరహాలు, చించలపు పద్మా, కొప్పిశెట్టి వెంకటేష్, రెవెన్యూ శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇచ్చేది లేదు

- గతంలో సేకరించిన భూములకు పరిహారం నేటికీ చెల్లించలేదు
- వేంపాడులో రైతుల నిరసన

నక్కపల్లి : మండలంలో ఏర్పాటు చేయబోతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ కోసం భూములు ఇచ్చే ప్రసక్తి లేదని వేంపాడుకు చెందిన పలువురు రైతులు స్పష్టం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో వీరంతా వేంపాడులో నిరసన తెలిపారు. తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములను స్టీల్‌ప్లాంట్ కోసం ఇచ్చేసి తామంతా రోడ్డున పడాల్సి వస్తుందని రైతులు అన్నారు. ఇప్పటికే 2100 ఎకరాలు ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ కోసం కేటాయించిందన్నారు. గతంలో భూములు ఇచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించకుండా మోసం చేసిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, రైతు నాయకులు సత్యనారాయణ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కోసం నక్కపల్లి మండలాన్నే ఎంచుకోవడంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రైతుల నుంచి కారు చౌకగా కొనుగోలు చేసి అధిక ధరలకు కార్పొరేట్ శక్తులకు విక్రయిస్తున్నారన్నారు., పేదల భూములతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం అదనంగా మరో 3200 ఎకరాలు సేకరించాలని నిర్ణయించడం దారుణమన్నారు. నెల్లిపూడి, వేంపాడు, డిఎల్ పురం, కాగిత గ్రామాలను ఎంచుకున్నారన్నారు. భూములు ఇవ్వడానికి ఈ గ్రామాల రైతులు అంగీకరించడడం లేదన్నారు.


అమలాపురంలో ఏపీఐఐసీ పనులు అడ్డుకున్న మత్స్యకారులు

ఎనిమిదో రోజుకు చేరిన మత్స్యకారుల ఆందోళన

కాగా అమలాపురంలో మత్స్యకార సొసైటీ భూముల్లో ఏపీఐఐసీ వారు రోడ్డు పనులు చేపట్టడాన్ని నిరసిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ గ్రామంలో కనకమహాలక్ష్మి సొసైటీకి ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం 43 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చిందని మత్స్యకారులు తెలిపారు. ప్రస్తుతం బల్క్ డ్రగ్ పార్క్ కొరకు ఈ భూములను ఏపీఐఐసీ వారు సేకరించారని, మత్స్యకార సొసైటీకి ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేస్తున్నారన్నారు. నష్టపరిహారం చెల్లిస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందని సీపీఎం నాయకులు అప్పలరాజు, మత్స్యకార నాయకులు పెదకాపు తాతారావు ఆరోపించారు. నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేయడాన్ని నిరసిస్తూ మత్స్యకారులు గత ఎనిమిది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పనులు అడ్డుకున్నామన్నారు. పోలీసులను రప్పించి బెదిరించాలని ప్రయత్నిస్తోందని, బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు కొనసాగించాలన్నారు. అప్పటి వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని మత్స్యకారులు తెలిపారు. రాంబిల్లిలో ఎన్ఏవోబీ కోసం సేకరించిన సొసైటీ భూములకు మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చారని ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు.

క్లుప్తంగా

మత్తుతో యువత జీవితాలు నాశనం


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్: మద్యం మత్తులో యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డి.డి. నాయుడు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదా కోసం ఆల్కహాల్, గంజాయి వంటి పదార్థాలు ముట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రాపేటి నారాయణరావు, యల్లపు సత్యనారాయణ, చవితిని నర్సింగరావు, వీరభద్రరావు, మల్లికార్జునరావు, బొడ్డేటి భాస్కర్, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్ ఏర్పాటు చేయరూ..


ఏఎంసీ కాలనీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తాచెదారం

అనకాపల్లి: స్థానిక ఏఎంసీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో కాలనీ వాసులు చెత్తాచెదారం వేసుకునేందుకు డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తా చెదారం వేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దీనిపై జీవీఎంసీ శానిటరీ సిబ్బంది తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

29న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి దత్త మందిరంలో ఈ నెల 29న జైజై గీత భగవద్గీత సమితి ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు జరుగనున్నాయని భగవద్గీత సమితి గౌరవాధ్యక్షుడు కడ్మిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. భగవద్గీతలో 13వ అధ్యాయం శ్లోకాలపై కంఠస్థ పోటీలు జరుగుతున్నాయని, ఆసక్తి గల వారు ఇప్పటికే భగవద్గీత అభ్యాసం చేసిన యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు. దత్త మందిరంలో ఆదివారం తొమ్మిది నుంచి 12 గంటల వరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే వారు ఆలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా రామకృష్ణ, విల్లూరి జయ శ్రీమాన్, జగదీష్‌లు వ్యవహరిస్తారని తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 26 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,970	4,970
రెండో రకం	3,700	3,700
మూడోరకం	3,600	3,650

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
కన్నప్ప	:సత్యనారాయణస్క్రీన్-1
8 వసంతాలు	: సత్యనారాయణ స్క్రీన్-2
కుబేరా	:పర్తిసాయి
సితారే జమీన్ పర్	:షిర్డీసాయి
పాప	:వెంకటేశ్వర
కట్టప్ప జడ్జిమెంట్	:శ్రీసత్య
మార్గన్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 72 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 15 యూనిట్లు, బీ పాజిటివ్ -18, ఓ పాజిటివ్ -34, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 312 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 236 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

భవన కార్మికులకు భరోసా కరువు

- పునరుద్ధరణకు నోచుకోని సంక్షేమ బోర్డు
- ఏడాదిగా ఎన్నికల హామీ పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- కార్మికులకు అందని ప్రయోజనాలు


వేల్పులవీధి సర్వకాంబదాంబ పార్కు వద్ద భవన నిర్మాణ కార్మికులు

అనకాపల్లి: రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు వారివి... కష్టాన్ని నమ్ముకుని జీవించే దినసర్య కూలీలు... చేతివృత్తే వారి జీవనాధారం... ఎప్పుడు పనులు ఉంటాయో తెలియని ప్రశాంతంత లేని జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వాలు మారినా వీరి జీవితాలు మారడం లేదు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. భవన నిర్మాణ కార్మికులు భద్రత, సంక్షేమం కోసం 1996లో అప్పటి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. మొదట్లో భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఉపయోగించే సంక్షేమ బోర్డులో తర్వాత కాలంలో అనేక మంది కులవృత్తుల వారిని ప్రభుత్వాలు చేర్పించాయి. ఉపాధి కూలీలు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, చిన్నపాటి దుకాణాల్లో మెకానిక్‌లు, తదితర అసంఘటిత కార్మికులకు సభ్యత్వం చేయిస్తున్నారు. వీటిపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

సభ్యత్వ నమోదు....

చేతివృత్తుల దారులు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు రెండు ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ జెరాక్స్ కాపీలతోపాటు కార్మికుడిపై ఆధారపడి జీవించే వారి ఆధార్ కార్డు జెరాక్స్ కార్మికశాఖకు అందజేయాలి. కార్మికశాఖ అధికారులు ఆన్‌లైన్లో వారి పూర్తి వివరాలను నమోదు చేస్తారు. కార్మికశాఖ నుంచి ఒకసారి తీసుకున్న కార్డు 5 సంవత్సరాల వరకూ పనిచేస్తుంది. గతంలో లేబరు కార్డు ఉన్న వ్యక్తులు మరలా రెన్యూవల్ చేసుకోవాలి.

లేబరు కార్డు వల్ల లాభాలు...

లేబరు కార్డు చేయించుకున్న కార్మికుడు పనిచేసే ప్రదేశంలో ప్రమాదవశాత్తు మృతిచెందినా, శాశ్వత అంగవైకల్యం పొందినా ప్రభుత్వం రూ.2 లక్షల సాయం అందజేస్తుంది. 50 శాతం అంగ వైకల్యం చెందిన వారికి రూ.లక్ష, సాధారణ మరణం చెందిన కార్మికుడికి రూ.30 వేలు అందజేస్తుంది. వివాహం తర్వాత కార్మికునికి ఒక్కో కుమార్తెకు డెలివరీ సమయంలో రూ.25 వేలు చొప్పున రెండు కాన్పులకు ఆర్థిక సహాయం అందిస్తారు. స్వల్ప మొత్తం చెల్లించి సభ్యత్వం పొందడం ద్వారా 5 ఏళ్ల పాటు కార్మికుడికి, కార్మికుడి కుటుంబానికి లేబరు కార్డు రక్షణగా పనిచేస్తుంది.

అనకాపల్లిలో భవన నిర్మాణ పనుల కోసం..

అనకాపల్లి పట్టణంలో వేల్పులవీధి సర్వకామదాంబ పార్కు, గవరపాలెం పార్కు సెంటర్లకు నిత్యం ఉదయం 8 గంటలకు అనకాపల్లి మండలం, కశింకోట, మునగపాక, అచ్యుతాపురం, చోడవరం, మాడుగుల, రావికమతం, బుచ్చెయ్యపేట యలమంచిలి మండలాల నుంచి వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు చేరుకుంటారు. అక్కడ నుంచి పనులు నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్తారు. భవనాల యజమానులు, కాంట్రాక్టర్లు సైతం ఇక్కడికి వచ్చి వీరిని తీసుకుని వెళ్లి రోజువారి కూలీలుగా పనులు చేయించుకుంటారు.

సమస్యలు...

ఇసుక తవ్వకం ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడం ప్రభుత్వం నిలివేయాలి. ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నడపాలి. ఇసుకపై అన్ని రకాల పన్నులు ఎత్తివేయాలి. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి. పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలి. ఇతర రాష్ట్రంలో మాదిరిగా మన రాష్ట్రంలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. సిమెంట్, ఐరన్, కలప, ఎలక్ట్రికల్ పెయింట్స్ స్టోర్స్‌లాంటి గృహోపకరణాల ధరలు నియంత్రణ చేయాలి.

కార్మికులకు పథకాలు అమలు చేయాలి



ఎండావాన లెక్కచేయకుండా అనకాపల్లి పట్టణానికి పనులు నిమిత్తం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనిచేసే ప్రాంతాల్లో అనుకోని ప్రమాదాలు జరుగుతాయి. కొంతమంది మృత్యువాత పడగా, మరి కొంత మంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ప్రభుత్వమే కొంత నిధిని ఇవ్వాలి.
– **డి.నాయుడు**, బుచ్చెయ్యపేట గ్రామం, మండలం

ప్రమాదాలప్పుడు పట్టించుకోలేదు



లేబరు కార్డు తీసుకునే సమయంలో ప్రభుత్వం రూ.120 కట్టించుకుని రసీదు ఇస్తుంది. ప్రమాదాలు జరిగినప్పుడు పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణ కార్మిక రంగంలో ఎక్కువగా మహిళలే పనులు చేస్తారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా భవన నిర్మాణ రంగంపై ఎక్కువగా మహిళలు ఆసక్తి చూపుతారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ప్రభుత్వాలే ఆదుకోవాలి. – **కె.సత్తిబాబు**, జమ్మాదులపాలెం, కశింకోట మండలం

చేతివృత్తిదారులందరికీ సభ్యత్వం



అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో 9,038 మంది కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చాం. లేబరు కార్డులు పంపిణీ చేయడం నిరంతర ప్రక్రియ. నెలకు రూ.20 వేలు ఆదాయం కంటే తక్కువగా ఉండి, ఈఎస్ఐ, పీఎఫ్ లేని కార్మికులకు లేబరు గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. వీరికి వెల్ఫేర్ స్కీమ్స్ వర్తిస్తాయి.
– **బాలకృష్ణ**, కార్మికశాఖ అధికారి, అనకాపల్లి

పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు కాస్త పెరిగాయి. దొండకాయ, బెండకాయ కిలోకి రూ.10 పెరిగింది. దొండకాయ, బెండకాయ గత వారం కిలో రూ.30 ఉండగా, ఈ వారం రూ. 40కి పెరిగింది. టమాటా, ఉల్లి రూ.30, క్యాబేజీ రూ.40, కాలీ ఫ్లవర్ రూ.50, బీట్రూట్, క్యారెట్ రూ.60, బీరకాయ రూ.80, క్యాప్సికం రూ.వంద, పాదు చిక్కుడు రూ.120కు విక్రయాలు సాగాయి.

అనకాపల్లిలో వర్షం


మెయిన్‌రోడ్డులో కురుస్తున్న వర్షం

అనకాపల్లి: మూడు రోజులుగా పట్టణ, మండల పరిధిలో వర్షాలు కురవడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం పట్టణ, మండల పరిధిలో 4.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌కు రైతులు ఈ వర్షాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


అజయ్

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామానికి చెందిన విద్యార్థి గొంతిన అజయ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. జంపపాలెం హైస్కూలులో టెన్త్ చదివిన అజయ్ 500కుపైగా మార్కులు సాధించాడు. దీంతో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. పల్లపు సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, ఏనుగుతుని గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

వారాహి అమ్మవారికి నవరాత్రుల పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్: మండలంలోని బట్లపూడి గ్రామంలోని సోహం ఆశ్రమంలో వారాహి అమ్మవారి నవరాత్రుల పూజలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ రోజూ ఉదయం తొమ్మిది గంటలకు కుంకుమ పూజలు, సాయంత్రం ఏడు గంటలకు హోమం జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల ఆదిలక్ష్మి, శిలపరిశెట్టి ఆదిబాబు, బొడ్డేడ ధనలక్ష్మి, దాడి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

అనకాపల్లి టౌన్: మండలంలోని సందరయ్యపేట ప్రభుత్వ పాఠశాలలో దివంగత పీవీ చలపతిరావు జయంతిని పురస్కరించుకుని పుస్తకాలు పంపిణీ చేశారు. పొట్టి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు గంగుపాం నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు పిరాట్ల నరసింహమూర్తి, పాఠశాల కమిటీ చైర్మన్ దుర్గారావు, కోలపర్తి శ్రీను, మళ్ల మల్లయ్యనాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రామకోటి లిఖిత పుస్తకాలకు పూజలు


రామకోట స్థూపం వద్ద శ్రీరామకోటి పుస్తకాలను వేస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానం ఆవరణలో రామకోట స్థూపం వద్ద గురువారం ఆషాఢ శుద్ధ పాడ్యమి సందర్భంగా రామకోటి లిఖిత పుస్తకాల పూజా కార్యక్రమం జరిగింది. దాత కొణతాల శివకుమార్ సహకారంతో 350 రామకోటి పుస్తకాలను ప్రచురించి భక్తులకు శ్రీరామనవమి రోజున అందజేశారు. భక్తులు కోటి శ్రీరామ నామాలతో రాసిన వీటికి దేవాలయం స్థూపం వద్ద అర్చకులు అంపోలు గోపాల్ కృష్ణశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్తక సంఘం కార్యదర్శి కొలతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) హాజరై ప్రత్యేక పూజలు చేసి రామకోటి పుస్తకాలను స్థూపంలో వేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు ఆళ్ల మహాలక్ష్మీనాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ల ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

అనకాపల్లి బార్ అసోసియేషన్ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన బార్ సభ్యులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పిళ్లా హర శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. గురువారం స్థానిక కోర్టు హాల్‌లో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా సుంకర శ్రీనివాసరావు, కార్యదర్శిగా బంధం వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా మళ్ల జగపతి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శులుగా శ్రీనివాసరావు, మోహన్, మహిళా ప్రతినిధిగా కుసుమ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సాయిరాం, ప్రభాకర్ వ్యవహరించారు. ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


చెక్కు అందిస్తున్న దాత మానే రజని

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన మానే రజని రూ.లక్ష విరాళాన్ని గురువారం అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.

రూ.2 లక్షలు ఎన్ని కుటుంబాలకు ఇచ్చారు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్


మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

అనకాపల్లి: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీగా కూటమి ఏడాది పాలన సాగిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ విమర్శించారు. గురువారం స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి రూ.2 లక్షలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని బాండ్‌లు రాసి ఇచ్చారన్నారు. ఏడాది పాలనలో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు త్వరలో గడపగడపకు వెళ్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు ఎంతవరకూ అమలు చేశారో ప్రజల వద్దకు వెళ్లి చెబుతామన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే వరకూ పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని రాష్ట్రంలో 30 శాతం మాత్రమే అమలు చేశారని, అర్హులైన లబ్ధిదారులు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలు అమలు చేయలేదని దుయ్యబట్టారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకూ రూ.1500 అందజేస్తామని ఏడాది పూర్తి అయినప్పటికీ నేటికీ ఒక్కరికీ ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, కశింకోట ఎంపీపీ కలగ లక్ష్మిగున్నయ్యనాయుడు, అనకాపల్లి మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కె.పద్మకుమారి, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లెల సాయి కిరణ్, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, మరిపల్లి శోభ, ధనలక్ష్మి, గైపూర్ రాజు, కుండల రామకృష్ణ, నీటిపల్లి లక్ష్మి, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

'జూలై 9 సమ్మెను విజయవంతం చేయండి'


ఎన్టీపీసీ వద్ద కరపత్రాలను పంపిణీ చేస్తున్న గనిశెట్టి

పరవాడ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్‌తో జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ మెయిన్‌గేట్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేసి, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చే చర్యలను విరమించాలన్నారు. సమాన పనికి సమాన వేతన చట్టాలను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులకు 8 గంటల పని వేళల్ని 12 గంటలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేసే పాలకుల విధానాలను వ్యతిరేకించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి, అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలో ఉన్న కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పైల పోతినాయుడు, పి.గోవిందరాజు, పైల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం.. రూ.10 లక్షల ఆస్తి నష్టం

- తమ్మయ్యపాలెంలో ఘటన, దగ్ధమైన బంగారు ఆభరణాలు, నగదు, సామగ్రి


కాలిపోయిన సామగ్రిని చూపిస్తున్న బాధితులు పైడమ్మ, కోటేశ్వరరావు దంపతులు


బాధితులకు నిత్యావసర సరకులను అందిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం శివారు తమ్మయ్యపాలెంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టంతో పాటు పట్టాదార్ పాస్ పుస్తకాలు వంటి విలువైన డాక్యుమెంట్లు కాలిబూడిదయ్యాయి. అధికారులు, బాధితులు తెలిపిన వివరాలు..

గ్రామానికి చెందిన జోగ పైడమ్మ, కోటేశ్వరరావు దంపతులు వ్యవసాయంతో పాటు, గాజువాకలో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. వారికి వివాహాలయ్యాయి. కుమారుడు భార్యతో కలిసి ఇంట్లోని కింది పోర్షన్‌లో ఉండగా, బాధిత దంపతులు మేడపైన షెడ్‌లో ఉంటున్నారు. వ్యాపారం కోసం గాజువాక వెళ్లాల్సి ఉండగా గురువారం ఉదయం పైడమ్మ టీ కాచేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఆమె బయటకు పరుగులు తీసింది. విషయం కొడుకు, కోడలికి తెలియడంతో, వారు పైకొచ్చేసరికి మంటలు పూర్తిగా వ్యాపించి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. ఈ ప్రమాదంలో మనవరాలికి సారె పెట్టేందుకు తెచ్చి ఉంచిన రూ.4 లక్షల నగదు, 4 తులాల బంగారు ఆభరణాలు, 20 బస్తాలు ధాన్యం, 10 కోళ్లు, 150 కిలోల వరకూ బొబ్బర్లు, మినుములు వంటి తృణ ధాన్యాలు, గృహోపకరణాలు, దుస్తులతోపాటు, విలువైన డాక్యుమెంట్లు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.10 లక్షల వరకూ ఆస్తినష్టం ఉంటుందని చెప్తున్నారు. మనవరాలికి సారె పెట్టేందుకు మూడు రోజుల క్రితమూ బంగారు ఆభరణాలు, నగదు బ్యాంకు నుంచి తెచ్చి ఇంట్లోని ట్రంక్ పెట్టెలో పెట్టినట్లు బాధితులు రోదిస్తూ చెప్పారు. కూరగాయల వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటూ రూపాయి రూపాయి పోగుచేసుకున్న సొమ్ము బుగ్గిపాలైందని పైడమ్మ బోరున విలపించింది. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేసింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ చిన్నికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను సేకరించారు. బాధితులకు బియ్యం, దుస్తులు వంటి నిత్యావసర సరకులు అందించారు. ప్రమాదంపై కలెక్టర్‌కు నివేదిక అందించి, ప్రభుత్వం తరపున ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు వంటి కాలిపోయిన డాక్యుమెంట్లు పునరుద్ధరించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వీఆర్వో డి.దేముడుబాబు, మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు, గ్రామ పెద్దలు ఉన్నారు.


కాలిపోయిన నగదును చూపిస్తున్న బాధితులు

క్వారీ తెరవద్దంటూ ఆందోళన


క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న జీ.కోడూరు రైతులు

మాకవరపాలెం: పంటలకు నష్టం కలిగించే క్వారీ తెరవద్దంటూ జీ కోడూరు దళిత రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని జీ కోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో గతంలో నల్లరాతి క్వారీ నిర్వహించేవారు. మరలా ఈ క్వారీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారని చుట్టుపక్కల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారంతా క్వారీ వద్ద ఆందోళన చేశారు. క్వారీ నిర్వహిస్తే బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు పడి తమ జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

యలమంచిలి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.వి జయ్‌కుమార్ తెలిపారు. ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల్లో పీజీ 50 శాతం మార్కులతో పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు.